www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 30 మే 2025
5
కాకినాడ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-పిఠాపురం, సామర్లకోట

విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులలో భాగంగా శుక్రవారం ఉదయం 7.00గం నుంచి మధ్యాహ్నం 12.00 గం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పిఠాపురం పట్టణం, కోలంక, జములపల్లి, మాధవపురం, ఇల్లింద్రాడ, నరసింగాపురంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. సామర్లకోట పిఠాపురం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇఇ ఎస్.ప్రభాకర్ తెలిపారు. టిడ్కో అపార్ట్‌మెంట్స్, పిఠాపురం రోడ్డు, 11 కెవి.జల్లూరు అగ్రికల్చర్ ఫీడర్, పిఠాపురం రోడ్డు వ్యవసాయ రైతులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పనుల్లేక భవన కార్మికుల పస్తులు..!

- ప్రభుత్వ రుణాల్లేక కానరాని నిర్మాణాలు
- ఇసుక అందుబాటులో ఉన్నా దొరకని పని
- కుదేలైన భవన నిర్మాణ రంగం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల పరిస్థితి గత కొంతకాలంగా అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం ఇసుక పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నప్పటికీ, మెటీరియల్ ధరలు పెరగక పోయినప్పటికీ నిర్మాణాలు సక్రమంగా జరగడం లేదు. ప్రభుత్వం మారిన తర్వాత గృహ నిర్మాణాల పనులు అంతగా జరగడం లేదు. సర్కారు కొత్త రుణాలను మంజూరు చేయకపోవడంతో ఎక్కడికక్కడ నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో భవన నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి కరువై అల్లాడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 5 లక్షల మంది భవన నిర్మాణ రంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. తాపీ మేస్త్రీలు, వడ్రంగి పనివారు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పని చేసే వారు, కూలీలు, ఇటుకల బట్టీలు ఇలా 56 రకాల పనులు చేస్తున్న కార్మికులు నిర్మాణ రంగంపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం ఈ రంగం కుదేలైందని చెప్పొచ్చు. గత ప్రభుత్వ హయాంలో నూతన ఇసుక పాలసీ వల్ల నెలల తరబడి ఇసుక అందుబాటులో లేకుండా పోయింది. ఆ తర్వాత రెండేళ్ల పాటు కరోనా మహమ్మారి అన్ని రంగాలనూ అతలాకుతలం చేసింది. ప్రధానంగా భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఆర్థిక అవస్థలు ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల పథకంలో రుణాలు మంజూరు చేయగా కొంతకాలం పాటు నిర్మాణరంగం ఒడిదుడుకులు లేకుండా నడిచింది. ఆ తర్వాత మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో మళ్లీ నిర్మాణాలు నిలిచిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఇలా గడచిన ఐదేళ్లలో ఈ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కొత్త నిర్మాణాలు లేవు

గత ప్రభుత్వ హయాంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-వైయస్సార్ (అర్బన్) బీఎల్సీ పథకం, పిఎం ఆవాస్ యోజన వైయస్సార్ (గ్రామీణ) పథకాల్లో 81,873 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు సుమారు 30 వేల ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 50వేలకు పైనే ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. ఇందులో 50 శాతం ఇళ్లు పునాది దశలోనే నిలిచిపోయాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోయి తగ్గడం లేదు. మరోవైపు ప్రభుత్వం ఇచ్చే అరకొర రుణం ఇంటి నిర్మాణానికి ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో పేదలు ఇళ్లను నిర్మించుకునేందుకు వెనకాడుతున్నారు. ఈ లోపు సాధారణ ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారిపోయింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం పూర్తయినప్పటికీ పేదలందరికీ ఇళ్ల పథకాన్ని పునరుద్ధరించలేదు. కొత్త రుణాలు మంజూరు లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కలిసి గతంలో రూ.1.80 లక్షలు ఉన్న రుణాన్ని రూ.2.5 లక్షలకు పెంచుతామని చెప్పారు తప్ప నేటికీ అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలో నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కొన్నిచోట్ల మాత్రమే జరుగుతున్నా అవీ అరకొర మందుకే ఉపాధిని చూపెడుతున్నాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులు పస్తులతో కాలం వెళ్లదీస్తున్నారు. కొందరు బిల్డర్లు అక్కడక్కడా మాత్రమే పనులు చెబుతున్నారు. 60 శాతం మందికి ప్రస్తుతం పనులు లేక అల్లాడుతున్న పరిస్థితి నెలకొంది.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటి నిర్మాణ పనులను మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలి. రుణాలు మంజూరు చేసి నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా ఆదేశాలు ఇవ్వాలి. ఇప్పటికే నిర్మాణరంగంపై ఆధారపడిన అనేక రకాల కార్మికులంతా ఆకలితో అలమటించే పరిస్థితులు ఏర్పడ్డాయి.

- పి.దుర్గా ప్రసాద్, తాపీ మేస్త్రి, నరేంద్ర పట్నం, జగ్గంపేట మండలం.

పనుల్లేక పస్తులు

ప్రస్తుతం నిర్మాణాలు చాలా చోట్ల నిలిచిపోయాయి. అర కొరగానే పనులు జరుగుతున్నాయి. దీంతో ఈ రంగంలో పని చేస్తున్న మాకు ఉపాధి కరువైంది. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం ప్రభుత్వం ఆదుకోవాలి.

- నాగమల్ల సత్యనారాయణ, తాపీ మేస్త్రి, బూరుపూడి, కిర్లంపూడి మండలం.

నిర్మాణ రంగాన్ని ఆదుకోవాలి

ప్రస్తుతం పనులు లేక నిర్మాణరంగం పూర్తిగా కుదేలయింది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ రంగాన్ని ఆదుకోవాలి. లేకపోతే ప్రజలకు కొనుగోలు శక్తి తగ్గిపోయి ఆర్థిక మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉంది. తక్షణమే ప్రభుత్వం స్పందించి అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా కొత్త రుణాలను వెంటనే మంజూరు చేయించి నిర్మాణాలను మొదలుపెట్టాలి.

- రొంగల ఈశ్వరరావు, భవన నిర్మాణ కార్మికుల సంఘం, జిల్లా ప్రధాన కార్యదర్శి.

చెవిలో పూలతో కార్మికుల నిరసన

సామర్లకోటలో చెవిలో పూలతో కార్మికుల నిరసన

ప్రజాశక్తి-సామర్లకోట, పెద్దాపురం

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సాంకేతిక నిపుణత కలిగిన కార్మికులకు రూ.29,200, నాన్-టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలని, 15 ఏళ్లకుపైగా సేవ చేసిన వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, సీనియారిటీ ప్రకారం వేతనాలు చెల్లించాలన్న నినాదాలు చేశారు. సంక్షేమ పథకాలు, హెచ్‌ఆర్ పాలసీ అమలుపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమ్మెలో యూనియన్ అధ్యక్షుడు కొండవీటి రామరాజు, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు మేడిపోయిన రమణ, రత్నరాజు, రమేష్, కురుకూరి మురళీకృష్ణ, చిక్కాల నాగార్జున, ఉండవల్లి రామరాజు, సత్యనారాయణ, భూదేవి, వెంకటేశ్వరరావు, స్వామి, చంద్రు రాజేష్, వారా సన్నీ బాబు, రమణమూర్తి పాల్గొన్నారు. **పెద్దాపురం**మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజినీరింగ్ కార్మికులు నిరసన తెలిపారు. కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. 23 రోజులుగా ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వ స్పందించడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాసిన భద్రరావు, ఆకుల రామకృష్ణ, పోల, ప్రశాంత్, వాకాడ భాస్కర్, ఎస్‌కె.బషీర్, తూతిక సాయి, సుంకర సత్తిరాజు, జి.నాగేశ్వరరావు, నాలం శివకుమార్ పాల్గొన్నారు.

పెద్దాపురంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

యోగాంధ్రతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి-సామర్లకోట, జగ్గంపేట

యోగాంధ్ర-2025 కార్యక్రమంతో అందరికీ ఆరోగ్యం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని సామర్లకోట ఎంపిడిఒ కె.హిమామహేశ్వరి పేర్కొన్నారు. సామర్లకోట మండలంలో ట్రెయినింగ్ ఆఫ్ ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమం గురువారం మూడో కొనసాగింది. ఈ శిక్షణను ఎంపిడిఒ కాదా హిమమహేశ్వరి, డిప్యూటీ ఎంపిడిఒ మల్లాడి భైరవమూర్తి, సీనియర్ అసిస్టెంట్ జగన్నాథరావు, ట్రైనర్స్ బంగార్రాజు, శ్రీనివాస్, రవి, ఆయుష్ మాస్టర్ ట్రైనర్స్ జగదాంబ, లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. **జగ్గంపేట** స్థానిక కాపు కల్యాణ మండపం వద్ద ఉద్యోగులకు నిర్వహిస్తున్న యోగా శిక్షణ నాలుగో రోజుకు చేరుకుంది. జూన్ 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పించేందుకు నెలరోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా గురువారం ఉద్యోగులకు యోగాలో శిక్షణ ఇచ్చారు.

ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలని ర్యాలీ

ప్రజాశక్తి-తుని

మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ కోసం తుని గొల్ల అప్పారావు సెంటర్లో గురువారం సిపిఎం తుని మండల కార్యదర్శి నక్కల శ్రీనివాస్ ఆధ్వర్యాన సమైక్యతా యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో మరణించిన భారతీయులకు నివాళులర్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తీవ్రవాదం, మతోన్మాదం దేశానికి ప్రమాదం అన్నారు. పెహెల్గాం ఉగ్రవాదులు కఠినంగా శిక్షించాలని. మతం పేరుతో విభజన చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో సాత్యకీదేవి, సయ్యద్ ఖాసిం, రామచంద్ర రావు, గొర్ల రమణ పాల్గొన్నారు.

రాలీలో పాల్గొన్న సిపిఎం నాయకులు

వైసిపికి వెంకటచలం రాజీనామా

ప్రజాశక్తి- పెద్దాపురం

వైసిపి కాకినాడ జిల్లా న్యాయ విభాగ అధ్యక్ష పదవికి, పార్టీకీ రాజీనామా చేసినట్లు పెద్దాపురం పట్టణానికి చెందిన న్యాయవాది కందుల వెంకటచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను వ్యక్తిగత కారణాల రీత్యా ఈ రాజీనామాలు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉచిత విద్యకు 56 మంది ఎంపిక

ప్రజాశక్తి -కరప

ప్రైవేట్ స్కూల్లో ఉచిత విద్య కోసం 56 మంది అర్హత సాధించినట్లు ఎంఇఒ పి.సత్యనారాయణ తెలిపారు. విద్యా హక్కు చట్ట ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఫ్రీ సీట్లు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో కరప మండలంలో 15 ప్రైవేట్ స్కూళ్లలో 56 మంది విద్యార్థులకు ఒకటో తరగతి ప్రవేశం కోసం సీట్లు కేటాయింపు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వ అందిస్తున్న అన్ని సౌకర్యాలు ఉంటాయని తెలిపారు.

ఒక రోజు ముందే పెన్షన్లు

ప్రజాశక్తి -కరప

మండలంలో సామాజిక పెన్షన్లను ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తామని ఎంపిడిఒ అనుపమ తెలిపారు. జూన్ నెల ఆదివారం ఒకటో తారీకు రావడంతో మే 31వ తేదీ శనివారం పెన్షన్ పంపిణీ చేస్తామని, దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లూ చేశామని తెలిపారు. వృద్ధులు, పెన్షన్లను పొందేందుకు 31నే అందుబాటులో ఉండాలని తెలిపారు.

రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా గతంలో మాదిరిగా రేషన్ షాపుల వద్ద ప్రజలకు సరుకులు అందించే ప్రక్రియను జూన్ ఒకటో తేదీ నుంచి అమలు చేసేందుకు మండలంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దారు కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో గురువారం మండల పరిధిలోని రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే బియ్యం పక్కదారి పడుతున్న విషయం గమనించిన ప్రభుత్వం ప్రజల బియ్యం అక్రమ రవాణాను నిరోధించడానికి తీసుకునే చర్యలలో భాగంగా ఇటీవల ప్రభుత్వం ఎండియు వాహనాల ద్వారా బియ్యం పంపిణీ విధానానికి స్వస్తి పలికిందన్నారు. ప్రస్తుతం తాజాగా చౌక ధరల దుకాణం ద్వారా పటిష్టంగా నిత్యావసరాల సరుకుల పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. దీనిలో భాగంగా జూన్ ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులు చౌక దుకాణాల ద్వారా షాపుల వద్దనే పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ నిరంతరాయంగా నిత్యావసర సరుకుల పంపిణీ జరుపుతున్నందున ప్రజలు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, మండల పరిధిలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

డీలర్లకు సూచనలు ఇస్తున్న తహశీల్దారు చంద్రశేఖర్

బాధిత కుటుంబాలకు వంగా గీత పరామర్శ

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను కాకినాడ మాజీ ఎంపీ, వైసిపి పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంగా గీత గురువారం పరామర్శించారు. ఉప్పాడ గ్రామంలో మెరుగు శ్యాము, పొన్నాడ గ్రామ శివారు మున్మిడివారిపాడులో ఉమ్మడి వెంకట్రావు మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కారే శ్రీనివాస్, మెరుగు ఎల్లాజీ, బొందు రాంబాబు, గంటా శ్రీనివాస్, గింజల శ్రీనివాస్, జ్యోతుల బాబులు, గొరిసే సతీష్ రెడ్డి, కంబాల యాకబ్బు, బొమ్మిడి గోవిందు, బండి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

బాక్సింగ్ పోటీలకు12 మంది ఎంపిక

ప్రజాశక్తి-పిఠాపురం

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు మొత్తం 12 మంది ఎంపికయ్యారు. గురువారం స్థానిక ఆర్‌ఆర్ బిహెచ్.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కాకినాడ జిల్లా నలమూలల నుండి 45 మంది బాక్సర్లు పాల్గొన్నారు. బాలికల విభాగంలో ఎంపికైన వారు ఈ నెల 31న విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని, బాలుర విభాగంలో ఎంపికైన వారు జూన్ 2న విశాఖపట్నం గాజువాకలో రాష్ట్రస్థాయి జూనియర్ బాయ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

దేవస్థానం భూములకు వేలం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

స్థానిక శివాలయం దేవస్థాన భూములకు గురువారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. పట్టణంలోని జగనన్న కాలనీ ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ 41లోని 10 ఎకరాల 30 సెంట్ల వ్యవసాయ భూమికి స్థానిక శివాలయంలో శివాలయం కమిటీ చైర్‌పర్సన్ గొల్లపల్లి బాబీ అధ్యక్షతన ఇఒ అశ్విని ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. రైతులు రూ.30,000 వేలు డిపాజిట్ చేసి పాటలో పాల్గొన్నారు. అత్యధికంగా రూ.32,2000లకు సిద్ధ వీరబాబు వేలం కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గరగ తాతాజీ, మొగలి అప్పన్న, దువ్వా తాతాజీ, మొగలిభద్రం రైతులు తదితరులు పాల్గొన్నారు.

మోటారు రిక్షాలను సబ్సిడీపై అందించాలి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

మోటారు అమర్చిన రిక్షాలను 50 శాతం సబ్సిడీపై రిక్షా కార్మికులకు అందిఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి కెవి.సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఉప్పాడ రిక్షా కార్మికులను కలిసి వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఐటియు నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆటో రిక్షాలతో పోటీని రిక్షా కార్మికులు తట్టుకోలేకపోతున్నారని అందుకే రిక్షా కార్మికులకు మోటర్ అమర్చిన రిక్షాలను సబ్సిడీపై ప్రభుత్వం అందించి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. జూన్ 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అత్యధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు.

సృజనాత్మక నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు సృజనాత్మక నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు వెంకట్రావు ఆధ్వర్యంలో బొమ్మలు గీయడం, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథ్స్ వంటి వాటిలో మెలకువలను అర్థమయ్యే రీతిలో వివరించారు. సృజనాత్మక నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కథలు చదవడం, కథలు చెప్పడంపై శిక్షణ ఇచ్చి విద్యార్థులతో కథలు చెప్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

291 ఇళ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో ఇంటి స్థలాలు ఉండి ఇళ్ల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 291 మంది అర్హులను గుర్తించామని గృహ నిర్మాణ సంస్థ డిఇ బి.సువర్ణరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం పట్టణ పరిధిలో 186 మంది, మండల పరిధిలో 105 మందిని గుర్తించామన్నారు. లబ్ధిదారుల నివేదికను ప్రభుత్వానికి పంపించామన్నారు. వీరికి ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.2.5 లక్షల ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. ఎస్‌సి, బిసి లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75 వేల ఆర్థిక సహకారం అందిస్తారన్నారు. ఈ దరఖాస్తులను ప్రభుత్వం ఆమోదించిన వెంటనే నిధులు విడుదలై ఇళ్ల నిర్మాణాలు మొదలు పెడతారన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఎఇ ఒ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిలగడ దుంప విత్తనపు తీగలు సిద్ధం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో కర్ర పెండలం దుంప విత్తనపు కర్రలు, చిలగడ దుంప విత్తనపు తీగలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జానకి తెలిపారు. ఒక మీటరు కర్ర పెండలం దుంప విత్తనపు కర్ర 7 ముచ్చులకు సరిపోతుందన్నారు. ఒక కర్ర నుండి 7 నాట్లు వేయవచ్చన్నారు, పెద్దాపురం పరిసర ప్రాంతాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుంప సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

600 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడలో సాయి ప్రియ సేవా సమితి అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ 46 పుట్టినరోజు సందర్భంగా పిఠాపురం కార్తికేయా హాస్పటల్ ఆధ్వర్యాన గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు కొమ్మూరు గోవింద్ బాబు, డాక్టర్ కర్రి దివ్య, వైద్య నిపుణులు డాక్టర్ యు.ఆదినారాయణ, డాక్టర్ వై.ఇలియాస్ 600 మందికి వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతుల పోరాటానికి అండగా సిపిఎం

ప్రజాశక్తి -కరప

సిరిపురంలో రొయ్యల అక్రమ సాగును నిలుపుదల చేయాలని పోరాడుతున్న రైతురంగానికి అండగా ఉంటామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు సిహెచ్ రమణి పేర్కొన్నారు. గతంలో సిరిపురంలోని గ్రామస్తులు, కౌలు రైతులు, రైతులతో కలిసి ఈ రొయ్యల అక్రమ సాగుపై పోరాటం నిర్వహించినట్లు తెలిపారు. దీంతో అక్రమ రొయ్యల చెరువులు నిర్వహిస్తున్న యజమాని సిపిఎం నాయకులపై కేసులు పెట్టారని తెలిపారు. రాజకీయ అండతో అక్రమ కేసులతో గ్రామస్తులను రైతులను బెదిరించి దౌర్జన్యంగా సాగు చేస్తున్నారన్నారు.

దోమలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి - సామర్లకోట

కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్న చందంగా తయారయింది స్థానిక గాంధీనగర్ ప్రాంతవాసులు పరిస్థితి. మున్సిపల్ అధికారులు స్పందించి పైపులైన్ల సమస్య పరిష్కరించారు అనుకుంటే మరోవైపు డ్రైనేజీ సమస్య పెరిగిపోయి దోమలతో అపరిశుభ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనమిది. స్థానిక గాంధీనగర్‌లో వాటర్ పైప్‌లైన్ పనుల అనంతరం పారిశుధ్యం పూర్తిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైప్‌లైన్ కోసం తవ్విన గోతుల మట్టిని నేరుగా డ్రైనేజీలో పడేయడం వల్ల మురుగునీరు బయటకి వెళ్లలేక రోడ్డుపై నిలిచిపోతోంది. దీంతో వాసనతో పాటు దోమల సంఖ్య విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ పనులు ముగిసి రెండు వారాలు అవుతున్నప్పటికీ ఇప్పటికీ డ్రైన్లు శుభ్రం చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

కార్టూ'నిజం'



కట్టమూరు ఆర్‌టిసి బస్సును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

జగ్గంపేట నుంచి కాకినాడ వెళ్లే ఆర్‌టిసి బస్సు సర్వీసును కట్టమూరు మీదుగా పునరుద్ధరించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా నాయకులు వై.గోపాలకృష్ణ, విద్యార్థులు శివ, రవి, సతీష్, దినేష్, ఆదినారాయణ, హేమంత్ మాట్లాడుతూ గ్రామం నుంచి కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం తదితర ప్రాంతాలలో పాఠశాలలు, కళాశాలల్లో ఎంతోమంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. పెద్దాపురం-జగ్గంపేట రహదారిలో తమ గ్రామ శివారు మీదుగా బస్సులు నడుస్తుంటాయన్నారు. బస్సు సెంటర్‌కు తమ గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరం ఉండడంతో విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లేవారు బస్సు సౌకర్యం లేక ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు చేసిన పోరాటాల ఫలితంగా ఆర్‌టిసి జగ్గంపేట, కాత్రావులపల్లి నుండి తమ గ్రామం మీదుగా కాకినాడ బస్సు ఏర్పాటు చేశారన్నారు. ఈ బస్సు అందరికీ ఎంతో సౌకర్యంగా ఉండేదన్నారు. ఇటీవల కట్టమూరు-జె.తిమ్మాపురం రహదారిలో గోతులు పడ్డాయన్న నెపంతో బస్సు నడపడం ఆపేసారన్నారు. త్వరలో పాఠశాలలు, కళాశాలలు తెరుస్తారని, ఆలోగా బస్సును పునరుద్ధరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

సమస్యలపై అధికారుల నిలదీత

ప్రజాశక్తి-గొల్లప్రోలు

అన్ని వార్డుల్లో సమాన రీతిగా అభివృద్ధి పనులు చేయడం లేదని, డ్రైనేజీ పూడిక తీత పనులను చేపట్టాలని వీధిలైట్లు, రోడ్లు, పారిశుధ్యం, రంగప్ప చెరువులో గుర్రపు డెక్క సమస్యలపై కౌన్సిల్ సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండ్రెడ్డి మంగతాయారు అధ్యక్షతన కమిషనర్ ఎన్.కనకారావు ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు గండ్రెడ్డి శ్రీరామచంద్రమూర్తి, గంట అప్పలస్వామి, గుళ్ళ సుబ్బారావు మైనం భవాని సమస్యలపై అధికారులను నిలదీశారు. తొలుత కమిషనర్ కనకారావు అభివృద్ధి పనులకు నగర పంచాయతీకి రూ.కోటి నిధులు జమ అయ్యాయని తెలిపారు. ఈ నిధులతో కొన్ని వార్డుల్లో అభివద్ధి పనులను చేసేందుకు టేబుల్ అజెండాను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నం చేశారు. కౌన్సిల్ సభ్యులు అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి జరగాలని, ఆ విధంగా లేదని ఎజెండాను తిరస్కరించారు. మేనేజర్ నవీన్ చంద్ర ఏజెండాను చదివి వినిపించారు. నగర పంచాయతీకి పారిశుధ్య నిమిత్తం ట్రాక్టర్లు కొనుగోలుకు కౌన్సిల్ ఆమోదం పొందింది. ఈ సమావేశంలో కౌన్సిలర్లు బెందుకుర్తి సత్తిబాబు, నాగేశ్వరావు, ఇరుగుల యేసు, నగర పంచాయతీ అధికారులు ఎఇ ప్రభాకర్, నీలిమా దీప్తి, కె.రఘు ప్రసాద్ పాల్గొన్నారు.

దేవస్థానం భూమి కౌలుకు వేలం ఖరారు

ప్రజాశక్తి-కాజులూరు

దేవస్థానం భూమి కౌలు వేలం ఖరారు అయిందని కోలంక కేశవ స్వామి ఆలయ ఇఒ సోమరాజు తెలిపారు. గురువారం కోలంక కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కౌలు వేలం పాటలో మూడేళ్లకు పాట నిర్వహించగా సంవత్సరానికి ఆరు ఎకరాల్లో శీలం నాగేశ్వరరావు రూ.1,71,000 పాడుకున్నారన్నారు. సోమేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి ప్రస్తుతం బోండా వెంకటబాబు రూ.2,02,000కు పాడుకున్నారని ఆయన తెలిపారు. ఈ వేలంలో యండమూరి సత్రం ఇఒ కృష్ణారెడ్డి, దాట్ల విజయ గోపాల్ రాజు, రఘు, సుబ్బరాజు, సూరిబాబు పాల్గొన్నారు.

పలుచోట్ల యోగాంధ్ర

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాల్లో పలుచోట్ల యోగాంధ్ర కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సంరద్భంగా కార్యక్రమాల్లో అధికారులు పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు.

రాజమహేంద్రవరం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రైతులు, మహిళలకు యోగా సాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, జిల్లా నోడల్ అధికారి ఎస్.చిన్నరాముడు పాల్గొని మాట్లాడారు. యోగా గురువు శివకుమార్ యోగ ప్రక్రియలపై సాధన చేయించారు. అనంతరం బ్రహ్మకుమారి బికె.శ్రావణి మెడిటేషన్ చేయించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ సీతారామమూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాల నుంచి వై జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ తాతారావు, జిల్లా సూక్ష్మ సేద్యాధికారి ఎ.దుర్గేష్, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.రమేష్, యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి డాక్టర్ పి.కాజియా, యోగా శిక్షకులు పాల్గొన్నారు. **రాజానగరం** స్థానిక శ్రీ రాజా కాంగ్రేగుల జోగి జగన్నాధం బహుదూర్ పంతులు అన్నదాన సత్రంలో యోగాపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జెఎ.ఝాన్సీ, తహశీల్దార్ జిఎస్ఎల్.దేవి, కార్యాలయ పరిపాలనాధికారి ఎం.సుబ్రహ్మణ్యం, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామభాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌డిఒ రాణి సుస్మిత

కొవ్వూరు మండలంలోని అరికిరేవుల, కొవ్వూరు పట్టణంలోని 14వ వార్డులో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆర్‌డిఒ రాణి సుస్మిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరికి వారు తమ వంతుగా యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జెడిఎల్.అప్పలకొండ, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మునిసిపల్ కమిషనర్ డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం: యోగా ఔన్నత్యాన్ని ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికీ చేరువచేసే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహి స్తోందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. గురువారం స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియం నందు 1600 మంది రైతులతో యోగా అభ్యాసనాల కార్యక్రమం యోగా గురువులు ఆయుష్ వైద్యులు ద్వారా ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లావ్యాప్తంగా 6000 మంది రైతులతో యోగా అభ్యసన కార్యక్ర మాలు నిర్వహించామన్నారు. రైతులు, ప్రజానీకం యోగాను తమ దైనందిన జీవితాల్లో భాగంగా యోగాచరణతో దేహదారుఢ్యంతో పాటు మానసిక ఆరోగ్యమూ సొంతం చేసుకోవాలన్నా రు. రోజువారిగా గంట పాటు నిర్వహించేలా ఈ యోగా కార్యక్రమాలను ఆరంభంలో ప్రతి ఒక్కరూ రోజువారిగా 15 నిమిషా లతో ప్రారంభించి దశల వారీగా గంటపాటు నిర్వహించేలా ఆచరిస్తూ అలవర్చుకోవాలన్నారు. వివిధ ప్రాంతాలలో యోగా అభ్యసన శిక్షణ కార్యక్రమాలు యోగా గురువుల ద్వారా నిర్వ హించడం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ మరో ముగ్గురిని ప్రోత్సహిస్తూ యోగా ఖ్యాతిని విశ్వ వ్యాపితం చేయాలని ఆయన ఆకాంక్షించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దిన చర్యగా ఆచరిస్తూ జీవితాంతం సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికీ యోగాను చేరువ చేసేందుకే యోగాంధ్ర కార్యక్రమాలను 26 రోజుల పాటు 26 ఇతివృత్తాలతో అమలు చేయ డం జరుగుతోందన్నారు. ఆరోగ్యకర సమాజ స్థాప న దిశగా యోగాను చేరువచేసేందుకు పెద్ద ఎత్తున కషి జరుగుతోందన్నారు. రైతులు, కార్మికులు, ఉపాధి హామీ శ్రామికులు, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు. ఇలా సమాజంలోని ప్రతివర్గానికి యోగాను నిర్వహించడం జరుగు తుందని ట్రైనర్లతో ప్రజలకు యోగాసనాలు నేర్పించడం ప్రస్తుతం జరుగుతోందని తెలి పారు. యోగా ప్రయోజనాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నా మని, ప్రజలు తమ జీవనశైలిలో యోగాను భాగం చేసుకొని జీవితాంతం అభ్యసించేలా ప్రోత్స హిస్తున్నామన్నారు. భారతీయ వారసత్వ సంపద అయిన యోగా ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ నిత్యం యోగాసనాలు వేయాలన్నారు ముఖ్యంగా కరోనా సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ తన ఫిట్నెస్ మంత్రాలతో చిత్రీకరించిన వీడియో ప్రపంచవ్యాప్తంగా మర ణాలు తగ్గించడానికి దోహదపడిందన్నారు. అలాంటి ఫిట్నెస్ మంత్ర గురించి అంతర్జాతీయ యోగ దినోత్సవంలో భాగంగా 21 రోజుల అవగాహనా సదస్సులు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. జెసి టి.నిషాంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాసనాలు నిర్దేశిత ఇతివృత్తాలతో ఆచరిస్తూ యోగేంద్ర అభినయంలో రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో ఆదర్శంగా నిలపా లన్నారు. నిర్వహించిన ప్రతి కార్యక్రమం ఇంస్టా గ్రామ్ వంటి ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారంగా విస్తున్నట్లు తెలిపారు జూన్ 2న రంగోలి పోటీలు, జూన్ 4న గ్రామ మున్సిపల్ ప్రభుత్వ అధికారు లు ద్వారా మేజర్ ఈవెంట్ ను నిర్వహించినట్లు తెలి పారు జిల్లాలో పర్యాటక, దేవాలయా లలో యోగేంద్ర అభ్యసన కార్యక్ర మాలు నిర్వహిం చడం జరుగుతుందన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్క రించుకుని విశాఖపట్నంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సుమారు 5 లక్షల మందితో యోగా అభ్యాస నాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి విజయ్ కుమారి డిఆర్ఒ రాజకుమారి, ఎఒ కాశీ విశ్వేశ్వరరావు, డిఇఒ సలీం భాష జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, డిఆర్‌డిఎ పీడీ గాంధీ, డ్వామా పీడీ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో యోగాంధ్ర కార్యక్రమం (ఇన్‌సెట్)లో పాల్గొన్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

నేరాలు ఘోరాలు

బాలికను మోసగించిన యువకునిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - రామచంద్రపురం

బాలికను నమ్మించి మోసం చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. కె.గంగవరం మండలం పామర్రుకు చెందిన మందపల్లి సాగర్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి గర్భిణిని చేశాడు. ప్రస్తుతం ఆమె ఏడవ నెల గర్భవతిగా ఉంది. అప్పటి నుంచి ఆమె పెళ్లి చేసుకోవాలని సాగర్ అడుగుతున్న అప్పుడే కుదరదు అని సాకు చెబుతూ తప్పించుకుంటున్నాడు. దీంతో నెలలు దగ్గర వస్తుండటంతో బాలిక కుటుంబీకులు ఆందోళన చెంది స్థానిక పెద్దలను ఆశ్రయించారు. అయితే గ్రామంలో ఏమి ఫలితం తేలకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు రామచంద్రపురం డిఎస్‌పి బి.రఘువీర్, అమలాపురం మహిళా ఎస్ఐ గంగాభవాని, కె. గంగవరం ఎస్ఐ షేక్ జాన్ బాషా, విఆర్ఒ మాగాపు వీరభద్రరావు, సిబ్బంది తదితరులు గురువారం సాయంత్రం విచారణ నిర్వహించారు. బాధితురాలైన బాలికను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె చెప్పిన వివరాలను రికార్డు చేశారు. దీనిపై నమోదు చేశారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ బాలికను మోసం చేసిన యువకునిపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. ప్రస్తుతం యువకుడు పరారీలో ఉన్నాడని అన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డిఎస్‌పి వెల్లడించారు. బాలికకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు పోలీసులను వేడుకున్నారు.

730 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని యర్నగూడెం గ్రామ శివారున ఇటుకల బట్టి వద్ద లారీలో తరలిస్తున్న 730 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ బి.నాగేశ్వర్ నాయక్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన కర్రె శ్రీశైలం తన లారీలో ఒడిస్సా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి ప్రాంతం నుంచి 730 కేజీల గంజాయిని లారీలో సీక్రెట్ క్యాబిన్లో నింపుకుని తెలంగాణకు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో స్థానిక పోలీసులు అప్రమత్తం అయ్యారని తెలిపారు. కొవ్వూరు నుంచి నల్లజర్ల వైపు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కన యర్నగూడెం గ్రామ శివారున లారీ పార్క్ చేయగా, పోలీసులకు వచ్చిన సమాచారంతో ఆ లారీని తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆ లారీలో గంజాయిని గుర్తించామని, దీంతో లారీతోపాటు, 730 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇదే లారీ గంజాయితో ఐదు రోజుల క్రితం దేవరపల్లి డైమండ్ జంక్షన్ దాటిన తర్వాత గోల్డెన్ ఫిష్ దాబా దగ్గర మోటార్ సైకిల్ మీద ప్రయాణిస్తున్న ఒక జంటను ఢీకొట్టిన సంఘటనలో ఆ జంట అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. అక్కడ నుంచి తప్పించుకున్న లారీ డ్రైవర్ పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు యర్నగూడెం గ్రామ శివారులో పార్కు చేశాడని తెలిపారు. తమ విచారణలో హైదరాబాదుకు చెందిన నర్సిరెడ్డి, యాదయ్యకు గంజాయిని రవాణా చేస్తున్నట్లు డ్రైవర్ తెలిపాడని చెప్పారు. గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడిన డ్రైవర్ శ్రీశైలనం గతంలో గంజాయి రవాణా చేస్తూ హైదరాబాద్ చౌటుప్పల్ స్టేషన్ పోలీసులు అరెస్టు చేశారని, ప్రస్తుతం అతను బెయిల్‌పై ఉన్నట్లు తెలిపారు. ఈ కేసులో సుమారు 22 లక్షలు రూపాయలు విలువగల 730 కేజీల గంజాయి మరియు ఒక సెల్ ఫోను, రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ ముద్దాయిని రిమాండ్ నిమిత్తం కొవ్వూరు కోర్టుకు తరలిస్తామన్నారు. ఈ కేసుకు సంబంధించి లోతైన దర్యాప్తు చేస్తామని తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ సుబ్రమణ్యం, హెడ్ కానిస్టేబుల్ వి.చక్రవర్తి, సిబ్బంది చంద్రశేఖర్, రమణ, సలీం, పి.రామారావులను సిఐ అభినందించారు.

జూదం ఆడుతున్న వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో బొమ్మ బొరుసు ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి గురువారం బొమ్మ బొరుసు ఆడుతున్న వారిపై దాడి చేశారు. ఈ దాడిలో నలుగురుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.2 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా కోడి పందాలు, పేకాట, ఇతర జూద క్రీడలు ఆడితే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం శివారులో బుధవారం రాత్రి ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గోపాలపురంలో ఉప్పరగూడెంకి చెందిన తుంగ వంశీ(25) తల్లి చిన్నతనంలోనే మృతి చెందింది. తండ్రి ఇద్దరు పిల్లలను వదిలేసి వేరే ప్రాంతానికి వెళ్లిపోయాడు. దీంతో వంశీ, అతని అక్క వందన గోపాలపురంలోని అమ్మమ్మ, తాతయ్యల వద్దే పెరిగారు. వంశీ చదువు మధ్యలోనే ఆపేసి కూలి పనులు చేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో తన అక్కకు ఏడేళ్ల క్రితం వివాహం కావడంతో అత్తారింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలోనే కొంతకాలం క్రితం అమ్మమ్మ, తాతయ్యల నుంచి బయటకు వచ్చేసిన వంశీ స్థానికంగా ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణం వద్ద పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి గోపాలపురం శివారు పొగాకు బోర్డు సమీపంలో గుండా సత్యనారాయణకు చెందిన పొలంలో వేప చెట్టుకు ఉరి వేసుకుని అనుమనస్పద స్థితిలో వంశీ మృతి చెందాడు. పోలీసులకు వచ్చిన సమాచారంతో ఎఎస్ఐ వై.సత్యనారాయణ తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని సందర్శించారు. అతని వివరాలు సేకరించి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సిహెచ్‌సికి తరలించారు. వంశీ మతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నారు.

పనామా, భారత్ సంబంధాలు బలోపేతం

ప్రజాశక్తి - అమలాపురం

పనామా,భారతదేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ అన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని వారి, దుశ్చర్యలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు డాక్టర్ శశి థరూర్ నేతృత్వంలోని అఖిల పక్ష పార్లమెంటరీ బృందం పనామా దేశం చేరుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పనామా దేశ అధ్యక్షుడు జోస్ రౌలి ములినో తో అఖిల పక్ష బృందం సమావేశమైనట్లు బృంద సభ్యులు హరీష్ తెలిపారు. ఈ సమావేశంలో ఇటీవలఉగ్రవాదులు కాశ్మీర్ లోని పహల్గాంలో జరిపిన దాడి గురించి, అలాగే ఆపరేషన్ సిందూర్ గూర్చి ములినో కు వివరించినట్లు చెప్పారు. ఉగ్రవాదంపై భారతదేశం తీసుకున్న స్పష్టమైన, నైతికమైన నిర్ణయానికి పనామా దేశ ప్రభుత్వం స్పందన ప్రశంసనీయమైనదని తెలిపారు. ఉగ్రవాదాన్ని ఖండిస్తూ దేశ, ప్రపంచ దేశాల భద్రత కోసం భారతదేశం తీసుకుంటున్న చర్యలకు అధ్యక్షుడు ములినో సంపూర్ణ మద్దతు వెల్లడించారని తెలిపారు. అదేవిధంగా ఈ సమావేశంలో భారత, పనామా దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కూడా ఈ సమావేశం జరిగిందని ఎంపీ హరీష్ తెలిపారు.


పనామా లో అఖిలపక్ష పార్లమెంటరీ బృందం

ఆహార భద్రతపై అవగాహన కల్పిస్తుంది అధికారులు

ఆహార భద్రతపై శిక్షణ

ప్రజాశక్తి - రామచంద్రాపురం

ఆహార భద్రతపై హోటల్ యజమానులు తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాలి అని ఫుడ్ సేఫ్టీ అధికారి కేశవ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆహార భద్రత పై గురువారం స్థానిక అక్షయ ఇన్ హోటల్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హోటళ్ల యజమానులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు.ఆహార కల్తీ జరిగితే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ ట్రెయినర్ కలకండ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ హోటల్ వ్యాపారులు ఆహార తయారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అవి పాటిస్తే ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించినట్లు అవుతుందన్నారు. దానివలన ఆహార సంబందిత వ్యాధులు తలెత్తకుండా ఉంటా యన్నారు. కార్యక్రమ ంలో కోనసీమ జిల్లా ఫోస్టాక్ ఫీల్డ్ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్స్ ఆనంద్‌కుమార్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ బాపనయ్య నాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

మేయర్‌గా పనిచేసిన బెజవాడ చిన బాపనయ్య నాయుడు జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సిఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపనయ్య నాయుడు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
Creditor I.P.No. 19/2023
Between:
పడాల సత్యనారాయణ రెడ్డి ...పిటీషనరు
AND
కదలి నాగ కవిత & others ...రెస్పాండెంట్లు
To:
2. కోన సునీత కుమారి,
భర్త: మనోజ్ బాబు,
గుడిముల శివారు, కందరిక,
సఖినేటిపల్లి మండలం, కోనసీమ జిల్లా.
పై నెంబరు పిటీషనులో 2వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం **ది. 25-06-2025**వ సం. **తేదికి** వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా కానీ, లేక న్యాయవాది ద్వారా కానీ హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పిటీషను ముందు గ్రంధము జరుపబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు న్యాయవాది,
ది.28-05-2025 పాలకొల్లు, ప॥గో॥జిల్లా

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వపరంగా సహకారం లేకపోయినా అప్పులు చేసైనా వ్యవసాయ చేస్తున్నట్లు కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీలో సాగైన పంటకు గిట్టుబాటు ధర దక్కలేదని, అయినా ఖరీఫ్ సాగుకు సిద్ధపడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మండలంలో 8500 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో భాగంగా రైతులు నారు మళ్ల వేసుకనే పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది అధికంగా పిఎల్‌ఎ 1100 నూజివీడు సీడ్ సంపద, స్వర్ణ సంపద గోల్డ్ ఎంటియు 1061, ఎంటియు 7029 స్వర్ణ రకాలు పండించే అవకాశం ఉందని మండలవ్యవసాయ శాఖ అధికారి కె.గోపాలకృష్ణ తెలిపారు.

నారుమడి వేసేందుకు సిద్ధంచేసిన పొలం

ముఖ్యమంత్రి పర్యటనలో నిరసనలకు పిలుపు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాజ్యాంగ విరుద్ధమైన ఎస్‌సి వర్గీకరణ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో నిరసనలకు డాక్టర్ బిఆర్..అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి మహిళా అధ్యక్షురాలు కాశి ముని కుమారి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నియోజక వర్గ పరిధిలోని ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో ఈనెల 31న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో రాజ్యాంగ బద్ధంగా శాంతియుత నిరసన తెలియజేయాలన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్‌సి వర్గీకరణ చేసి ఎస్‌సిలలోని ఉప కులాలకు తీవ్ర అన్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాలమహానాడు శ్రేణులు, వివిధ దళిత సంఘాలు,ప్రజా సంఘాలు, అధిక సంఖ్యలో పాల్గొని నిరసన తెలియజేయాలని ఆమె కోరారు.

వంగవీటి విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

కొత్తపల్లి ఊర చెరువు సెంటర్లో ఉన్న వంగవీటి రంగా విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో గురువారం జనసేన, రంగా అభిమానులు ఉప్పాడ, పిఠాపురం రహదారిలో బైఠాయించి రంగా విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. దీంతో రహదారిపై బైఠాయించడంతో ట్రాఫిక్ అంతరాయం విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేష్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రేషన్ డిపోలను పరిశీలించిన తహశీల్దారు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణం, మండల పరిధిలోని రేషన్ డిపోలను గురువారం తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆమె ప్రతి రేషన్ డిపోకు సంబంధించిన డేటా బేస్‌ను నమోదు చేశారు. 1వ తేదీ నుంచి రేషన్ డిపోల ద్వారా రేషన్ సరుకుల పంపిణీకి సంబంధించి ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామని తెలిపారు.

31న అథ్లెటిక్స్ శిక్షణ ముగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ శిక్షణా శిబిరం ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టివిఎస్.రంగారావు, కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎస్‌విఎల్‌జి.వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం జరిగే ముగింపు సభలో సీనియర్ క్రీడాకారులు, ప్రముఖులు పాల్గొంటారన్నారు. ఈ సభలో శిక్షణ పొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఎఇ డి.శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి గోపాలపురం సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్పు చేస్తున్నందున గోపాలపురం, వేలచింతలగూడెం, వాదాలకుంట, వెదుళ్ళకుంట, బీమోలు, తొక్కిరెడ్డిగూడెం, గుడ్డుగూడెం, కొవ్వూరుపాడు, కరగపాడు, బుచ్చిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు త్రీఫేస్ సప్లయి ఉంటుందన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం ఇరిగేషన్ శాఖలో ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఇరిగేషన్ ఉన్నతాధికారులకు టిడిపి నాయకులు పండూరి అప్పారావు, తలారి మూర్తి గురువారం వినతిపత్రం అందించారు. ఐదేళ్ల కాలం పూర్తయ్యిన ప్రతి ఉద్యోగీ బదిలీ కావాల్సి ఉండగా కొందరు సిఫార్సులతో అదే సీటు అంటిబెట్టుకుని ఉంటున్నారన్నారు. ఇలా రెండు దశాబ్దాలుగా కదలకుండా చాలా మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. ఒక కార్యాలయం నుంఇచ మరో కార్యాలయానికి మారుతూ ఇక్కడే పాతుకుపోతున్నారు తప్ప మరో ప్రాంతానికి వెళ్లకుండా పావులు కదుపుతున్నారనానరు. ఇటువంటి అన్యాయాలకు తావు లేకుండా నిబంధనల మేరకు బదిలీ చేయాలని వారు కోరారు. ఈ విషయాన్ని స్థానిక ఎంఎల్ఎ, ఇరిగేషన్ శాఖ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు.

ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం స్థలం పరిశీలన

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణం ఇందిరా నగర్ నుంచి బసివిరెడ్డి పేటకు వెళ్లేందుకు, చిన్న కాశీ రేవు వద్ద రైలు పట్టాలు దాటేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం మున్సిపల్ చైర్మన్, మున్సిపల్, రైల్వే అధికారులు గురువారం వివిధ ప్రాంతాల్లో పర్యటించి అణువైన ప్రదేశాలను పరిశీలించారు. చడం జరిగింది. నిత్యం రైళ్ల రాకపోకలతో రద్దీగా ఉండడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు. ఇది కార్యరూపం దాల్చితే ప్రమాదాల నుంచి రక్షణగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని అచ్చుతాపురం గ్రామంలో వైసిపి నాయకులు బత్తుల కామరాజు సౌజన్యంతో గురువారం మెగా గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన కేశవ్ ఎమర్జెన్సీ అండ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శశాంక్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇసిజి, ఇకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. బిపి, షుగరు, కార్డియాలజీ, చాతి నొప్పి, ఆయాసం తదితర సమస్యలపై వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల వెంకటరామకృష్ణ, మాదేటి శ్రీనివాస్, జాజుల మురళి, నల్లల బుజ్జి, బత్తుల కామరాజు, బత్తుల నాగార్జున, జుట్టుక సూర్యచంద్ర, అరుగుల వెంకన్నబాబు, ఏగిపాటి నరేష్, బత్తుల చందు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు : కాకినాడ
E.A.No.179/2024 in **E.A.No.12/2024**
E.P.No.20/2021 in O.S.No.366/2018
Between:
గుండుమోగుల వీర వెంకట సత్య గంగాధర రావు ...పిటీషనర్/ డిక్రీ హోల్డరు
మరియు
సానా ఏసుబాబు అండ్ 5 అదర్స్...రెస్పాండెంట్స్
రెస్పాండెంట్ నెం.1: సానా ఏసుబాబు, S/o. కొండలరావు, బిజినెస్, డో.నెం.43-1-45, నియర్ కుమార్ బిస్కెట్స్, మెయిన్ రోడ్, కాకినాడ, కాకినాడ అర్బన్, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్.
రెస్పాండెంట్ నెం.2: సానా శివ, S/o. సానా ఏసుబాబు, డో.నెం.43-1-45, నియర్ కుమార్ బిస్కెట్స్, మెయిన్ రోడ్, కాకినాడ, కాకినాడ అర్బన్, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్.
రెస్పాండెంట్ నెం.3: గుండా భాగ్యవతి, W/o. గుండా శ్రీనివాస రావు, D/o.సానా ఏసుబాబు, C/o.గుండా వెంకట రాజు,డో.నెం. 3-24, డీగల పేట, గోల్లపాలెం గ్రామం, కాజులూరు మండలం, తూ॥గో॥జిల్లా.
ఈ పై తెలిపిన ఇ.ఎ.నెంబరు:179/2024 లో ఇ.ఎ.నెంబరు:12/2024 లో ఇ.పి.నెంబరు:20/2021 లో ఓ.ఎస్.నెంబరు 366/2018 లో ఒకటి నుండి ముగ్గురు రెస్పాండెంట్స్ కోర్టు ద్వారా పంపిన నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఆదేశానుసారము ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ పై నెంబర్లు గల కేసులో శ్రీ కోర్టు వారు **ది. 16-06-2025వ తేదీన గం.10.30 ని॥లకు** ఒకటి నుండి ముగ్గురు రెస్పాండెంట్స్ హాజరు అగుటకొరకు వాయిదా వేసియున్నారు. కావున తెలియజేయటమైనది. సదరు ఒకటి నుండి ముగ్గురు రెస్పాండెంట్స్ అయిన మీరు ప్రత్యక్షముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు ఉన్న యెడల తెలియ పరచుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.
|| By Order of Court ||
కె. లక్ష్మీనారాయణ, అడ్వకేట్
కాకినాడ. సెల్: 95505 46466

CHANGE OF NAME
I, HARIKA NARSIPALLI, D/o. N.Venkateswara Rao, D.No. 82-17-15/B, 2nd Floor, Achuth Conclovia 2nd Lane, Mahalakshmi Temple Street, AVA Road, Rajamahendravaram, E.G.District, A.P., I have changed my name from **KOLLIVELASI HARIKA** (Old Name) to **HARIKA NARSIPALLI** (New Name). Henceforth Iam being called **HARIKA NARSIPALLI,** D/o. N.Venkateswara Rao, for all purpose.

పేరు మార్పు
ముంగర శ్రీధర్ తండ్రి: వీర స్వామి అను నేను ఇప్పటివరకు ముంగర్ శ్రీధర్ త్యాజంపూడి గ్రామ నివాసి డో.నెం.2-157గా పిలవబడినాను. ఇప్పుడు నా పేరు ముంగర్ శ్రీధర్ నుండి ముంగర శ్రీధర్ గా మార్చుకున్నాను. ఇకనుండి నా పేరు ముంగర శ్రీధర్ గా పిలవబడతాను.
ముంగర శ్రీధర్ తండ్రి: వీర స్వామి
ఫోన్: 8639055269

IN THE COURT OF THE HON'BLE 1ST. ADDL.DISTRICT AND SESSIONS JUDGE AT :: SIDDIPET
M.V.O.P. No. 183 OF 2022
BETWEEN :
Gunnala Laxmi & others ... Petitioner/Claimants
AND
G. Lacha Babu & Others ... Responsdents/ Respondents
To,
G. Lacha Babu S/o. Bulli Appa Rao, Aged about: 32 Years, Occ. : Driver, R/o. H.No. 12-32, Karri Vari Street, Chebrolu, Gollaprolu, District East Godavari, A.P. - 533449
Respondent - No.1.
WHEREAS the claimants filed the above M.V.O.P. No. 183 of 2022 case for claiming the compensation before this Hon'ble court on account of the death of my son Gunnala Hari Krishna against you, and the same is posted on **12-06-2025.** You are hereby required to appear on that day at **10"30 a.m.** before the above court either in person or through a pleader failing which the matter will be decided as per law.
// BY ORDER OF THE COURT //
NARRA SRINIVAS REDDY
Advocate
Siddipet
Cell : 9440037062

కోర్టు నోటీసు
మహారాజశ్రీ గౌరవ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 318/2024 in
O.A. No. 200/2024
Between:
పడాల సత్యనారాయణరెడ్డి, S/o. మునిరెడ్డి, టీచర్, R/o. D.No. 5-105/A, పందలపాక గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా.
-వాది (Plaintiff/ Petitioner)
AND
1. సిరిపరపు సురేష్‌కుమార్, S/o. లేటు అప్పారావు, బిజినెస్, R/o. D.No. 4-118, కొమరిపాలెం గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా.
2. సిరిపరపు ప్రసన్న లక్ష్మి, W/o. సురేష్‌కుమార్, గృహిణి, R/o. D.No. 4-118, కొమరిపాలెం గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా.
-ప్రతివాదులు (Defendants/ Respondents)
పై నెంబరు దావాలో వాది/ పిటిషనర్ మహారాజశ్రీ గౌరవ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో వాదిగా మీపై సివిల్ సూట్ I.A. No. 318/2024 in O.A. No. 200/2024 దావా/ వాద్యం దాఖలు చేసియున్నారు. సదరు వాద్యంలో కోర్టు వారు పైన వివరించిన చిరునామాకు అనేక పర్యాయములు పోస్టు ద్వారాను, కోర్టు ద్వారాను సమన్లు పంపించినప్పటికినీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా కోర్టు సమన్లు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు. కావున మీరు **ది. 17-06-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** సదరు పైన వివరించిన కోర్టు నందు మీరు స్వయంగా గాని, లేదా మీ లాయరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని యెడల కోర్టు వారు మీ పరోక్షమున వాద్యం తీర్మానించెదరు.
(గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
జె.నాగేశ్వరరావు
అనపర్తి వాది తరపు న్యాయవాది
తేది:29-5-2025 సెల్: 8074054030